క్లుప్తంగా

రేపు అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కేరళ సంవత్సరాదిని పురస్కరించుకుని కొత్తపేట వాగు సెంటర్‌లో వీరాంజనేయ స్వామి వారి ఆలయంలోని అయ్యప్ప స్వామి వారికి 15వ తేదీ పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజామున 5–30 గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం 7 గంటలకు పంచామృత అభిషేకాలు, అలంకరణ జరుగుతాయన్నారు. స్వామి వారికి జరిగే విశేష అభిషేకాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఈవో రావూరి వెంకటేశ్వరరావు, చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్వామి వారి అభిషేకాలను పురస్కరించుకుని దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఇఫ్తార్ విందును జయప్రదం చేయండి

భవానీపురం(విజయవాడపశ్చిమ):పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీన విద్యాధరపురం ఆర్టీసీ డిపో పక్కన (బైపాస్ రహదారి వెంబడి) రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందుకు ముస్లిం మైనార్టీలందరూ హాజరై జయప్రదం చేయాలని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ గౌస్ మొహిద్దీన్ కోరారు. స్థానిక శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆయన పశ్చిమ నియోజకవర్గంలోని పలు మసీదుల వద్ద ఇఫ్తార్ విందుపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని నూర్ – ఎ – ఇలాహి మసీదుకు 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డితో కలిసి జుహర్ నమాజుకు హాజరయ్యారు. అనంతరం మసీదు కమిటీ పెద్దలు, పలువురు స్థానిక మత పెద్దలతో మాట్లాడారు. ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారని, అలాగే పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

కుమారుడు అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కుమారుడు అదృశ్యంపై తల్లి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఆంజనేయ వాగు ప్రాంతానికి చెందిన జగుపిల్లి పార్వతి, దాలినాయుడు భార్యాభర్తలు. వీరు సుగంధ వాటర్ అమ్ముతుంటారు. వీరికి నలుగురు సంతానం. కుమారుడు అప్పారావు కూడా ఇదే వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 8వ తేదీన అప్పారావు సరుకులు నిల్వ చేసే రూమ్ వద్ద ఉండిపోయాడు. ఆ తర్వాత నుంచి అప్పారావు కనిపించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలతో బ్రాహ్మణులకు లబ్ధి

అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవి కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పథకాల్లో బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని భాగస్వామ్యం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్ అన్నారు. విజయవాడలోని ఓ హోటల్లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చరిత్రలో తొలిసారిగా బ్రాహ్మణ సామాజిక వర్గం ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతోందన్నారు. గతంలో కార్పొరేషన్ ద్వారా పథకాలు అందించారే తప్ప ప్రభుత్వ పథకాల్లో బ్రాహ్మణులు లబ్ధిదారులుగా లేరన్నారు. నవరత్న పథకాల ద్వారా బ్రాహ్మణ కార్పొరేషన్ కంటే ఎక్కువ లబ్ధి కలుగుతుందని చెప్పారు. వైఎస్సార్ ఈ బీసీ నేస్తం ద్వారా ఏటా 23 వేల మందికి పైగా నిరుపేద బ్రాహ్మణ మహిళలకు మేలు జరుగుతుందన్నారు. వైఎస్సార్ పింఛను కానుక ద్వారా 47345 మందికి లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని విమర్శలు చేసే వారికి జగన్ ప్రభుత్వంలో జరిగిన మేలును గణాంకాలతో సహా వివరిస్తానన్నారు. ప్రయాగ కృష్ణ, ఏవీజీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జలియన్‌వాలా బాగ్ నాటకం



పటమట(విజయవాడతూర్పు):జలియన్ వాలాబాగ్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్య్ర సమర యోధుల స్ఫూర్తిని వివరించే జలియన్‌వాలా బాగ్ నృత్య రూపకం ఆకట్టుకుంది. దేశం కోసం ప్రాణాలర్పించిన ప్రతి ఒక్కరికీ నివాళులర్పించే విధంగా విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించారు. ఈ సందర్భంగా అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర సమరంలో రౌలత్ చట్టం, జలియన్‌వాలాబాగ్ ఉదంతం మొత్తం మార్చివేశాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని కల్పించేందుకు ప్రదర్శించామని వివరించారు.

జనం లేక బాబు పరువు రోడ్డున పడింది

- విజయవాడలో చంద్రబాబు సభ అట్టర్ ఫ్లాప్
- వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): విజయవాడ నగరంలో బుధవారం టీడీపీ నాయకులు నిర్వహించిన సభలో జనాలు లేక చంద్రబాబు పరువు రోడ్డున పడిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు ఇన్చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం కృష్ణలంక ప్రాంతంలో తెలుగు తమ్ముళ్లు నిర్వహించిన సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని ఎద్దేవా చేశారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకుని తిరిగే చంద్రబాబు సభకు జనాలు కరువయ్యారని తెలిపారు. విజయవాడ నగరంలో చంద్రబాబు పరువు రోడ్డున పడిందన్నారు. కనీసం 200 మంది కూడా ఈ సభకు హాజరు కాలేదని పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ టీడీపీ నాయకులు కృష్ణానదిలోకి దూకాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదిలా ఉండగా వయసు మీదపడి మాటలు తడబడుతున్న చంద్రన్న సైకిల్ పోవాలంటూ తన ప్రసంగంలో చెప్పటం ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నిజాన్ని ఒప్పుకున్నారని ఎద్దేవా చేశారు. కాల్ మనీ, సెక్స్ రాకెట్ వంటి కుంభకోణాలు నిర్వహించిన ఘనత తెలుగు తమ్ముళ్లకే దక్కుతుందని విమర్శించారు.

టిడ్కో ఇళ్ల పేరిట లక్షలు దండుకున్నారు..

పదేళ్లుగా తూర్పు నియోజవర్గం ఎమ్మెల్యేగా ఉన్న గద్దే రామ్మోహన్ ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేశారో చెప్పాలని అవినాష్ డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు కృష్ణలంక ప్రాంతాన్ని విస్మరించారని తెలిపారు. పేదలకు టిడ్కో ఇళ్లు ఇస్తామని నమ్మించి లక్షలాది రూపాయలు దండుకున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రమే కృష్ణలంక ప్రాంతం అభివృద్ధి జరిగిందన్నారు. వరద పోటుతో ఇబ్బందులకు గురవుతున్న ప్రజానీకానికి రిటైనింగ్ వాల్ నిర్మించి ఆ సమస్యను పరిష్కరించామని తెలిపారు. అదే కృష్ణలంక ప్రాంతంలో ముస్లిం మహిళపై జరిగిన దాడికి ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ కారకుడు కాదా అని ప్రశ్నించారు. కృష్ణలంక ప్రాంత ప్రజలకు ఆకట్టుకునేందుకు కార్పొరేటర్‌గా గెలవలేని వ్యక్తి కోసం చంద్రబాబు సభ పెట్టే విధంగా దిగజారిపోయాడని వివరించారు. టీడీపీ నాయకులు ఎన్ని చిల్లర రాజకీయాలు చేసినా వచ్చే ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ జెండా ఎగురుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ వెంకటసత్యనారాయణ, కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, ఎన్టీఆర్‌జిల్లా యువజన అధ్యక్షుడు కొరివి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆత్మగౌరవానికి ప్రతీక బీపీ మండల్

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు, సామాజిక న్యాయ కోవిదుడు బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) బీసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. బీహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు బీపీ మండల్ అన్నారు. మేజిస్ట్రేట్‌గా ఒక్క రూపాయి వేతనం కూడా తీసుకోకుండా నిజాయితీగా పని చేసిన ఆదర్శప్రాయుడని కొనియాడారు. నాటి ప్రధాని మురార్జీ దేశాయ్ వెనుకబడిన తరగతుల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు 1978లో ఐదుగురు సభ్యులతోకూడిన కమిషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దానికి చైర్మన్‌గా వ్యవహరించిన బీపీ మండల్ వెనుకబడిన తరగతుల జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగం, రాజకీయం, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించాలని 40 సిఫార్సులతో నివేదిక సమర్పించారని వివరించారు. బీసీ నాయకులు కోసూరి రమేష్, కత్రోజు సతీష్, వెంకట్, బాలకృష్ణ, రాజేష్, మాదల తిరుపతిరావు, ఎస్పీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

బీపీ మండల్ వర్ధంతిని పురస్కరించుకుని భవానీపురం బీసీ సంక్షేమ సంఘం, ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు ఆధ్వర్యంలో స్థానిక చాత్తాద శ్రీవైష్ణవ సంఘం కార్యాలయంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి మాదల తిరుపతిరావు, ఏపీ చాప్టర్ శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీ యశోద, చాత్తాద శ్రీవైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షులు టీ పూర్ణయ్య, హెచ్‌బీకాలనీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షులు జె రామారావు, వైస్ ప్రెసిడెంట్ మత్తే విజయరాజు, అంకాని నాగరాజు, పీ అమృత, ఎ పార్వతి, ఎం దుర్గ పాల్గొని నివాళులర్పించారు.

రంజాన్‌మాసం గొప్ప సందేశం

ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా



డెప్యూటీ సీఎం అంజాద్‌బాషాను సత్కరిస్తున్న కమిటీ ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):రంజాన్ మాసం కేవలం ముస్లింలకే కాకుండా యావత్ ప్రజానీకానికి గొప్ప సందేశాన్నిస్తుందని ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జరుగుతున్న జాగార పండుగల్లో భాగంగా బుధవారం రాత్రి నైజాంగేట్ వద్ద ఉన్న మహ్మదీయ మసీదులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అంజాద్ బాషా, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ మాసం ఇస్లాంలో చాలా ముఖ్యమైన, పవిత్రమైన మాసమన్నారు. ఈ మాసంలో నిర్వహించే ప్రార్థనలు, దాన కార్యక్రమాలకు భగవంతుడు విశేష ఫలితాన్ని అందిస్తారని మత గ్రంథాలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభ్యున్నతికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ముస్లిం వర్గాలకు అత్యధిక పదవులను కేటాయించి గౌరవించారని వివరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రముఖులు అంజాద్‌బాషాను సత్కరించారు. మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ ముక్తియార్, ప్రముఖులు అఫ్సర్, హుస్సేన్, కరిముల్లా, ఖాదర్, రఫీ, వాజీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చండీయాగంలో భాగస్వాములు కావాలి



సహస్ర చండీయాగం కరపత్రాలను విడుదల చేస్తున్న గౌతమ్‌రెడ్డి, గజల్ శ్రీనివాస్ తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి మేలు కలగాలనే ఆకాంక్షతో నిర్వహిస్తున్న సహస్ర చండీయాగం, కుంభాభిషేకంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి తెలిపారు. నైనవరం ఫ్లైవోవర్ సమీపంలోని శ్రీకరుమారి అమ్మన్ శక్తిపీఠం ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గౌతమ్‌రెడ్డి మాట్లాడారు. సహస్ర చండీయాగం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 72 అడుగుల ఎత్తయిన మహా చండీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇటువంటి యాగాలు, హోమాలతో వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలతో రైతులు, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటారని చెప్పారు. రాష్ట్రాన్ని పాలించే వారితో పాటు ప్రజలందరికీ ఎంతో శుభకరమన్నారు. కరోనా వంటి విపత్తుల నుంచి అమ్మవారు ప్రజలందరినీ కాపాడతారని, సహస్ర చండీయాగానికి తమ వంతు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సేవ్ టెంపుల్స్ భారత సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీదేవి కరుమారి అమ్మన్ ఎంతో మహిమాన్విత శక్తిగల అమ్మవారన్నారు.

దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల మానవులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ మేరకు కరపత్రాలను అతిథులు ఆవిష్కరించారు. శక్తిపీఠం పీఠాధిపతి కరుమారి దాసు, విష్ణు పారాయణ మండలి కన్వీనర్ ఎం. సత్యశ్రీహరి, ఆలయ కోశాధికారి జ్ఞానేశ్వర్, ఆలయ అర్చకులు దీక్షితులు, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రం చిత్రాన్ని ఆదరించాలి

హీరో అల్లరి నరేష్



విలేకరుల సమావేశంలో ఉగ్రం చిత్ర యూనిట్

పటమట(విజయవాడతూర్పు): ఉగ్రం సినిమాలో పోలీస్‌పాత్రతో మే 5 న ప్రేక్షకుల ముందుకు వస్తున్నానని హీరో అల్లరి నరేష్ తెలిపారు. ఉగ్రం సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందని చెప్పారు. నగరంలోని ఒక హోటల్లో ఉగ్రం చిత్ర యూనిట్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేష్ మాట్లాడారు. సామాన్యుడికి సమస్య వస్తే పోలీసుల వద్దకు వెళ్తాడు.. అదే పోలీసుకు సమస్య వస్తే దాన్ని ఎలా పరిష్కరిస్తారని చిత్ర కథాశమన్నారు. తన 60 వ చిత్రం ఉగ్రంను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ఇప్పటి వరకు తాను చేసిన క్యారెక్టర్లు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించాయని, ఉగ్రం చిత్రంలో ఒక పవర్ ఫుల్ పోలీస్ పాత్రతోపాటు వివిధ గెటప్పుల్లో కనబడతానని పేర్కొన్నారు. దర్శకుడు విజయ్ తనలో ఉన్న కొత్త కోణాన్ని ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు చూపించనున్నాడని తెలిపారు. దర్శకుడు విజయ్ మాట్లాడుతూ నాంది చిత్రం తర్వాత సేమ్ యూనిట్‌తో ఉగ్రం చిత్రాన్ని నిర్మించానని తెలిపారు. నిజాయితీ కలిగిన పోలీస్ ఆఫీసర్‌గా నరేష్ అందరినీ అలరిస్తారన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ చరణ పాల్గొన్నారు.

ఇఫ్తార్ అందించడం దైవకార్యం



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, గౌతమ్‌రెడ్డి తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):రంజాన్ మాసం సేవా భావాన్ని, దానం గొప్పతనం గురించి తెలియజేస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. రంజాన్‌ను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్. మొహర్రాజ్ ఆధ్వర్యంలో గురువారం చిట్టినగర్ ఈద్గామహల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అతిథులు ముస్లిం పెద్దలు, మసీదు కమిటీ ప్రతినిధులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనడంతో పాటు ఇఫ్తార్‌ను స్వీకరించారు. రంజాన్ నెల రోజులు ఉపవాస దీక్షతో ఉన్న వారికి ఇఫ్తార్ అందించడమంటే అది దైవ్యకార్యమేనన్నారు. రంజాన్ మాసం సేవా బావాన్ని, దానం గొప్పతనాన్ని తెలియజేస్తుందన్నారు. పేదలకు రంజాన్ తోఫా, ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేసిన మొహర్రాజ్ సేవలు అభినందనీయమన్నారు. మోతీ మసీదు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖాజా, ఇషాక్ ఆలీ రషీద్, షేక్ . భాషా, డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, చిచ్చా బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం రాష్ట్రానికే గర్వకారణం

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని సీఆర్ ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం, ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడ ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మీడియా రంగంలో విశేష కృషి చేసిన జర్నలిస్టులకు, ఉద్యోగులకు గురువారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథరెడ్డి మృతి పట్ల రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం కొమ్మినేని మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జర్నలిస్టులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. విజయవాడ నగరం నడిబొడ్డులో ఏర్పాటు చేస్తున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. అనంతరం 11 మంది జర్నలిస్టులకు, రిటైర్డ్ ఉద్యోగులను మెమెంటో, శాలువాతో సత్కరించారు. రాష్ట్ర గ్రంథాయల సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, ఏపీ ఎస్ఆర్టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకటరావు, వైఎస్సార్ మేధావుల ఫోరం చైర్మన్ జి.శాంతమూర్తి, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు పాల్గొన్నారు.

సామాజిక వికాసానికి నూతన సాంకేతికత



నమూనాను తిలకిస్తున్న అధ్యాపకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నూతన సాంకేతిక పరిజ్ఞానం సామాజిక వికాసానికి ఉపయోగడాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో స్వేచ్ఛ సంస్థ సౌజన్యంతో మూడు రోజులు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ముగింపును పురస్కరించుకొని గురువారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. లక్ష్మణస్వామి మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ రంగాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ప్రజలకు మేలు చేసే నూతన ఆవిష్కరణలను తీసుకురావాలని సూచించారు. స్వచ్ఛ సంస్థ ద్వారా విద్యార్థులకు మూడు రోజుల వర్క్‌షాప్ మంచి ఫలితాన్నిచ్చినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛ సంస్థ అధ్యక్షులు శ్రీపతి రాయ్ మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే వివిధ సాంకేతిక నమూనాలను విద్యార్థులు తయారు చేశారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు ఎ.రవి, ఎం.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణకు అభినందనలు



ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణను అభినందిస్తున్న యానాదయ్య తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎ.సత్యనారాయణను ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య గురువారం గొల్లపూడిలోని దేవదాయ శాఖ కార్యాలయంలో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణకు శాలువా కప్పి సత్కారం చేశారు. అనంతరం చైర్మన్ యానాదయ్య మాట్లాడుతూ దేవాలయాల్లో పని చేసే నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రభుత్వం జారీ చేసిన జీఓను అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద భారీ ఎత్తున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియ చేస్తూ 'థ్యాంక్యూ సీఎం సార్' సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయనను అభినందించిన వారిలో ఏపీ ఆలయాల కేశఖండన నాయిబ్రాహ్మణ జేఏసీ అధ్యక్షులు గుంటుపల్లి రామదాసు, ఉపాధ్యక్షులు ఆర్వీ రమణ, కోశాధికారి ఏజీఎల్ నారాయణ, సుందరపల్లి దాసు, పెనకుదురు సంతోష్ ఉన్నారు.

భర్త అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):తన భర్త కనిపించడం లేదంటూ భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. మహంతిపురానికి చెందిన ఎం. దైవసు సీత, మధుబాబు భార్యాభర్తలు. మధుబాబు ఎల్ఐసీలో ఉద్యోగం చేస్తుంటాడు. గత కొంత కాలంగా మధుబాబు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు.

అన్ని మంచి శకునాలే చిత్ర యూనిట్ సందడి



విలేకర్లతో మాట్లాడుతున్న చిత్ర సభ్యులు

పటమట(విజయవాడతూర్పు): 'అన్ని మంచి శకునాలే' చిత్ర బృందం గురువారం నగరంలో సందడి చేసింది. నగరంలోని ఓ హోటల్లో చిత్రం ప్రమోషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చిత్ర దర్శకులు నందినిరెడ్డి మాట్లాడుతూ ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమని తెలిపారు. స్వప్న సినిమా బ్యానర్స్‌లో అశ్వినిదత్ నిర్మాతగా ఈ చిత్రం విడుదల కానుందని పేర్కొన్నారు. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ ఎంతో ఆహ్లాదంగా ఉండబోతుందన్నారు. చిత్రంలోని పాటలు అందరినీ అలరిస్తాయన్నారు. మే 18న చిత్రం విడుదల కాబోతుందన్నారు. హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ స్వప్న బ్యానర్లో నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తనకు అవకాశం ఇచ్చినందుకు డైరెక్టర్ నందినికి, అశ్విని దత్‌కి కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్ మాళవిక నాయర్ మాట్లాడుతూ ఈ చిత్రంలో అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ప్రజా రవాణా సంస్థ సిబ్బంది నిజాయతీ



బస్టాండ్(విజయవాడ పశ్చిమ):ప్రజా రవాణా సంస్థ సిబ్బంది మరోమారు తమ నిజాయతీ నిరూపించుకున్నారు. రూట్ నంబర్ 10 (రైల్వే స్టేషన్-పెనమలూరు) బస్‌లో బుధవారం రాత్రి ప్రయాణించిన ప్రతిమ అనే ప్రయాణికురాలు తన లగేజీ బ్యాగును మరచి గమ్య స్థానంలో దిగింది. ఇంటికి వెళ్లిన తరువాత బ్యాగును మరచిన విషయాన్ని గ్రహించి తాను ప్రయాణించిన బస్సు గవర్నర్‌పేట 1 వ డిపో మేనేజర్‌కు ఫోన్ ద్వారా తెలియజేసింది. వెంటనే స్పందించిన డిపో మేనేజర్ కండక్టర్‌కు సమాచారం అందించి బస్సులో ఉన్న బ్యాగును భద్రపరిచారు. గురువారం ఉదయం ఆ బ్యాగులో ఉన్న ల్యాప్‌టాప్, ఇతర విలువైన వస్తువులు, నగదును డిపో సిబ్బంది సమక్షంలో ప్రయాణికురాలికి అందచేశారు.

● నోరూరిస్తున్న మామిడి



పండ్లలో రారాజు మామిడి మార్కెట్‌లో సందడి చేస్తోంది. విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో నోరూరించే మామిడికాయలు విక్రయిస్తున్నారు. రసాలు, బంగినపల్లి తదితర రకాల కాయలు బుట్టల్లో తెచ్చి అమ్ముతున్నారు. ఏలూరు రోడ్డులో ఓ వ్యాపారి మామిడికాయలు విక్రయిస్తున్న చిత్రమిది. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ప్రజా వ్యతిరేక బీజేపీని సాగనంపుదాం

భవానీపురం(విజయవాడపశ్చిమ):ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బీజేపీని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యురాలు పంచదార్ల దుర్గాంబ పిలుపునిచ్చారు. విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని ఉప్పలపాటి సుబ్బరాజు భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం వచ్చిందన్నారు. మోదీ, అమిత్ షా నాయకత్వంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాల్సిన ప్రజల మధ్య విద్వేషపు చిచ్చు రాజేస్తుందన్నారు. మరో వైపు అదాని, అంబాని వంటి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతుందని ధ్వజమెత్తారు. నేటి నుంచి సీపీఐ–సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార యాత్రలు జరుగుతున్నాయని చెబుతూ వాటికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. 44, 45 డివిజన్ల సీపీఐ కార్యదర్శులు బుద్దే రాజ, ఉప్పలపాటి శివప్రసాద రాజు, సహాయ కార్యదర్శి యరసాని జోసఫ్, ఏపీ రంగారావు, సీపీఎం నాయకులు కుండనాల శేషమణి తదితరులున్నారు.